జ్వరాల వ్యాప్తి.. జాగ్రత్తలు

సత్తుపల్లి పీహెచ్‌సీ డాక్టర్‌తో నేడు ఫోన్ ఇన్



బి.సురేష్ నారాయణ్



సత్తుపల్లి: సత్తుపల్లి ప్రాంతంలో ప్రజలు డెంగీ, చికున్‌గున్యా, విష జ్వరాలతో మంచానపడుతున్నారు. ఈ జ్వరాల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించేందుకు 'సాక్షి' ముందుకు వచ్చింది. ఈ మేరకు సోమవారం ఫోన్ ఇన్ కార్యక్రమం నిర్వహిస్తోంది. జ్వరాల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సత్తుపల్లి ఏరియా ప్రభుత్వాస్పత్రి ఎండీ జనరల్ ఫిజిషియన్ బి.సురేష్ నారాయణ్ ప్రజల సందేహాలకు సమాధానాలు ఇస్తారు.

తేదీ : 26-08-2024, సోమవారం

సమయం :

ఉదయం 11 నుంచి 12గంటల వరకు

ఫోన్ చేయాల్సిన నంబర్ :

9866573055

క్లుప్తంగా

ఐకమత్యానికి చిహ్నం వనభోజనాలు



వనభోజన కార్యక్రమంలో శ్రీవెంకటసాయినగర్ కాలనీవాసులు

కారేపల్లి: కారేపల్లి శ్రీవెంకటసాయినగర్ కాలనీవాసులు ఆదివారం వనభోజనాల కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. స్థానికంగా ఉన్న సింగరేణి టౌన్‌షిప్ వనంకు కాలనీవాసులు కుటుంబ సమేతంగా వెళ్లి వనదేవతకు ప్రత్యేక పూజలు చేసి, వర్షాలు కురవాలని, పంటలు పండాలని మొక్కుకున్నారు. అనంతరం వంటావార్పు చేసుకొని, అక్కడే సహపంక్తి భోజనాలు చేసి, ఆటపాటలతో ఆనందంగా గడిపారు. అనంతరం వారు మాట్లాడుతూ.. ఐక్యమత్యానికి చిహ్నంగా వనభోజన కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో కాలనీపెద్దలు ఈసం భాస్కర్, ధనసరి సమ్మయ్య, రామారావు, రవి, వెంకటేశ్వర్లు, పూనెం శివరాం, భరత్, శ్రీనివాస్, రమాదేవి, ఉష, రోహిణి, రమ, లక్ష్మి, అన్నపూర్ణ, ఈశ్వరీ, రమణ తదితరులు పాల్గొన్నారు.

బదిలీ ఏఈఓకు సన్మానం



ఏఈఓ సురేష్‌ను సన్మానిస్తున్న దృశ్యం

కల్లూరురూరల్: మండలంలోని పెద్దకోరుకొండి క్లస్టర్ ఏఈఓ కొత్తపల్లి నరేష్‌ను ఆదివారం స్థానిక రైతు వేదికలో ఘనంగా సన్మానించారు. ఏఈఓ నరేష్ ఈ ప్రాంత రైతులకు విశిష్టమైన సేవలు అందించి రైతుల మన్నన పొందారని పలువురు కొనియాడారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి రూప, మాజీ జెడ్పీటీసీ సభ్యులు అజయ్‌కుమార్, రైతు నాయకులు మాదిరాజు అన్నంరాజు, రైతులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం

కల్లూరురూరల్: రోడ్డుప్రమాదంలో కల్లూరులోని గోపాలకుంటకు చెందిన గోకరి శివ ఆదివారం మరణించాడు. విషయం తెలుసుకున్న కాంగ్రెస్ నాయకుడు లక్కినేని రమేష్ మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. బాధిత కుటుంబ సభ్యులకు ఆర్థిక సాయం అందించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ కిరణ్‌కుమార్, రాజు, మాజీ వార్డు సభ్యులు వెంకటేశ్వర్లు, ఏసు, రమేష్ పాల్గొన్నారు.

పరామర్శ..

పెనుబల్లి: కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుడు మట్టా దయాదయానంద్ పలు కుటుంబాలను ఆదివారం పరామర్శించారు. మండలంలోని లంకపల్లికి చెందిన మాచినేని కోటేశ్వరరావు ప్రథమ వర్ధంతి కార్యక్రమానికి హాజరై కుటుంబ సభ్యులను ఓదార్చారు. అదే గ్రామానికి చెందిన కొత్త సంజయ్ మృతి చెందడంతో ఆయన మృత దేహాన్ని సందర్శించి నివాళులర్పించారు.

సీనియర్ కాంగ్రెస్ నాయకుడికి..

కల్లూరురూరల్: జిల్లా కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు పసుమర్తి చందర్‌రావు అనారోగ్యానికి గురై కొంతకాలంగా హైదరాబాద్‌లోని యశోద ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ఈ మేరకు కల్లూరు కాంగ్రెస్ నాయకులు ఆదివారం ఆస్పత్రికి చేరుకొని పసుమర్తి చందర్‌రావును పరామర్శించారు.

27న ఉచిత వైద్యశిబిరం

ముదిగొండ: మండలపరిధిలోని వెంకటాపురంలో ఈనెల 27న వృద్ధులకు ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు ముదిగొండ హోమియో వైద్యాధికారిణి సంఘమిత్ర ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. వృద్ధులకు ఉచితంగా షుగర్, బీపీ పరీక్షలు నిర్వహించి ఉచితంగా హోమియో మందులు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. వైద్యశిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

వైరా: సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ప్రధానంగా గ్రామాల్లో జ్వరాలు విపరీతంగా ఉన్నాయి. డెంగీ, చికున్‌గున్యా, వైరల్ జ్వరాల బారిన పడుతున్నారు. వాటి నుంచి ప్రజలు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, నివారణ చర్యలపై ఆదివారం 'సాక్షి'ఆధ్వర్యంలో వైరా ప్రాథమిక కేంద్రం వైద్యురాలు టి. ఉదయలక్ష్మి వైరా మున్సిపాలిటీ, మండలంలో జ్వారాలపై ఫోన్ ఇన్ కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ప్రజల నుంచి విశేష స్పందన లభించింది. ప్రజల సందేహాలకు ఆమె పలు సూచనలు చేశారు.

ప్రశ్న: గ్రామంలో జ్వరాలు ఎక్కువ ఉన్నాయి. ఎటువంటి జాగ్రత్తలు తీసుకోవాలి.

– షేక్.లతీఫ్, సిరిపురం

జవాబు: దోమలు, పరిసరాలు అపరిశుభ్రంగా ఉండడం, నీళ్లు నిల్వ ఉండడం వలన జ్వరాలు విజృంభిస్తున్నాయి. నిల్వ ఉన్న నీళ్లల్లో దోమలు గుడ్లు పెట్టి లార్వా తయారవుతున్నాయి. ప్రధానంగా దోమలు సంతరించకుండా చూసుకోవాలి. జ్వరాల బారీన పడ్డ వారిని ఐసోలేషన్‌లో ఉంచాలి.

ప్ర: గ్రామంలో చికెన్‌గున్యా, వైరల్ జ్వరాలు అధికంగా ఉన్నాయి.

– షేక్.సైదా గొల్లపూడి

జ: చికెన్ గున్యా జ్వరం వచ్చిన వారికి 2 నుంచి 3 నెలల పాటు కీళ్ల నొప్పులు ఉంటాయి. ద్రవ పదార్థాలు ఎక్కువ తీసుకోవాలి. కళ్ల వెనుక కండరాలు విపరీతమైన నొప్పులు ఉంటాయి. జ్వరాల తీవ్రత మనిషి శరీరాన్ని బట్టి ఉంటుంది. వాంతులు, విరోచనాలు వంటివి కూడా వస్తుంటాయి. జ్వరం తగ్గినప్పటికీ జాగ్రత్తలు పాటిస్తేనే ప్రభావం ఉంటుంది. లేదంటే మరల రెండవ సారి వచ్చే అవకాశం ఉంది.

ప్ర: జ్వరాలు రాకుండా ఎటువంటి జాగ్రత్తలు తీసుకోవాలి.

– నాగరాజు, 16వ వార్డు, వైరా

జ: జ్వరాలు రాకుండా జాగ్రత్తల్లో ప్రధానంగా దోమకాటు లేకుండా చూసుకోవాలి. నీళ్లు నిల్వ ఉండకుండా పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా చూసుకోవాలి. డెంగీ దోమ పగలు మాత్రమే కుడుతుంది.



'సాక్షి' ఫోన్ ఇన్‌లో మాట్లాడుతున్న ప్రభుత్వ వైద్యురాలు టి. ఉదయలక్ష్మి

మోకాళ్ల కింద నుండే దోమ కుడుతుంది. దోమలు కుట్టకుండా నిండు దుస్తులు ధరించాలి.

ప్ర: గ్రామంలో జ్వర పీడితులు ఎక్కువ మంది ఉన్నారు.

– కమలాకర్, సిరిపురం

జ: గ్రామంలోని డ్రెయినేజీల్లో మురుగు నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలి. నిల్వ ఉన్న నీళ్లలో ఆయిల్ బాల్స్ వేయాలి. మురుగు నీరు ఎక్కడ ఉండకుండా చూసుకోవాలి. మురుగు నీళ్లల్లో దోమలు పెరిగితే అవి ఎక్కువగా వృద్ధి చెంది స్వైరవిహారం చేస్తాయి. రెండ్రోజుల్లో గ్రామంలో హెల్త్ క్యాంపు నిర్వహిస్తాము. జ్వరాలపై సర్వే నిర్వహించి పూర్తి స్థాయి నివారణ చర్యలు తీసుకుంటాం.

ప్ర: గ్రామంలో జ్వరాల సర్వే నిర్వహించండి.

– మల్లు రామకృష్ణ, స్నానాల లక్ష్మీపురం

జ: గ్రామంలో సీజనల్ వ్యాధుల అధికంగా ఉన్నాయనే విషయం మా దృష్టికి వచ్చింది. గ్రామంలో సర్వే నిర్వహిస్తాం, డ్రైడే – ఫ్రైడే కార్యక్రమాలు చేపడతాం. పూర్తి సర్వే చేసి జ్వరాల నివారణ చర్యలు చేపడతాం.

ప్ర: డెంగీ జ్వరాల వలన ఇబ్బందిగా ఉంది.

– నవీన్, తాటిపూడి

జ: డెంగీ జ్వరం వలన ప్రధానంగా కాళ్లు లాగినట్లు, ఒళ్లు నొప్పులు, వాంతులు, విరేచనాలు వంటి అవుతుంటాయి. దద్దుర్లు రావడం, అంతర్గాతంగా రక్తస్రవం కావడం, ర్యాషెస్ వంటి వస్తుంటాయి.



దోమలు ఉదయం 6 నుండి సాయంత్రం 6 గంటల వరకు మోకాళ్ల కింద మాత్రమే కుడుతుంటాయి. జాగ్రత్తగా ఉండాలి.

ప్ర: జ్వర తీవ్రత అధికంగా ఉంటుంది. ఎటువంటి జాగ్రత్తలు తీసుకోవాలి.

– ముక్కార పుల్లారెడ్డి, దాచాపురం

జ: వైరల్ జ్వరాలు ప్రధానంగా ఒళ్లు నొప్పుల తోఉంటాయి. కళ్లు వెనుక భాగంలో నొప్పులు తీవ్రంగా ఉంటాయి. పారాసిట్మాల్ టాబ్లెట్ ఆరు గంటలకు ఒకసారి వేసుకోవాలి. జ్వరపీడితులు విశ్రాంతి ఎక్కువ తీసుకోవాలి. ఓఆర్ఎస్ ద్రావణం, కొబ్బరి బొండాలు వంటి ద్రవ పదార్థాలు తరుచూ తీసుకోవాలి.

ప్ర: జ్వర బాధితులు ఒక్కో ఇంట్లో ఇద్దరు ఉంటున్నారు.

– ఐనాల కనకరత్నం, సిరిపురం

జ: గ్రామంలో జ్వరాలు ఉన్న మాట వాస్తవమే. వ్యక్తిగతంగా ప్రతి ఒక్కరూ పరిశుభ్రతను పాటించడంతో పాటుగా పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా చూసుకోవాలి. పూల కుండీల్లో, ఇంటి ఆవరణల్లో నీళ్లు నిల్వ ఉండకుండా చూసుకోవాలి. జ్వరం బారీన పడితే వెంటనే వైద్యులను సంప్రదించాలి.

ప్ర: కీళ్ల నొప్పులు అధికంగా ఉంటున్నాయి.

– ఇందిర, పూసలపాడు

జ: జ్వరం వస్తే వారం రోజుల పాటు ఇబ్బందులు ఉంటాయి. కీళ్ల నొప్పులు ఎక్కువ రోజులు ఉండే అవకాశం ఉంది. మజ్జిగ, కొబ్బరి నీళ్ల వంటి ద్రవ పదార్థాలు అధికంగా తీసుకోవాలి. మల్టీవిటమిన్, పారాసిటమాట్ వంటి టాబ్లెట్‌లు ఆరు గంటలకు ఒక సారి వేసుకోవాలి.

ప్ర: గ్రామంలో పారిశుద్ధ్య పనులు చేపట్టడం లేదు.

– కిషోర్, రెబ్బవరం

జ: వారంలో రెండు రోజుల పాటు వైద్యా ఆరోగ్య శాఖ సిబ్బంది పారిశుద్ధ్య పనుల్లో ఉండాలి, మంగళవారం, శుక్రవారం డ్రైడే పాటించాలని ప్రభుత్వ ఆదేశాలు ఉన్నాయి. వర్షాకాలం సీజన్‌లో పారిశుద్ధ్యం ప్రధానం.

పార్టీలో చేరిన వారికి అండగా ఉంటాం



కాంగ్రెస్‌లో చేరిన వారితో మల్లు నందిని

మధిర: మధిర నియోజకవర్గంలో డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క చేపడుతున్న అభివృద్ధి పనులకు ఆకర్షితులై వివిధ పార్టీల నుంచి కాంగ్రెస్‌లో చేరిన నాయకులకు, కార్యకర్తలకు నిరంతరం కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క సతీమణి మల్లు నందిని అన్నారు. శనివారం రాత్రి జిల్లా కాంగ్రెస్ నాయకులు మధిర పట్టణ 10వ వార్డు కౌన్సిలర్ మల్లాది వాసు ఆధ్వర్యంలో బంజారా కాలనీలోని 200 బీఆర్ఎస్‌కు చెందిన కుటుంబాలు కాంగ్రెస్ పార్టీలో చేరారు. వారికి ఆమె కాంగ్రెస్ పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ముందుగా మధిర ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం నుంచి మల్లాది వాసు నాయకత్వంలో కాంగ్రెస్ కార్యకర్తలు భారీ ప్రదర్శనతో బంజారా కాలనీకి వెళ్లారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు సూరంశెట్టి కిషోర్, నాయకులు సుధాకర్, వంశీ, రామారావు, బాలరాజు, రవికుమార్, నవీన్ రెడ్డి, బంజారా కాలనీ వార్డు కౌన్సిలర్ మాధవి, చంటి తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగులకు ట్రై సైకిళ్లు..

చింతకాని: మండలంలోని 20 మంది దివ్యాంగులకు ఆదివారం నాగులవంచలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ట్రై సైకిళ్లు అందించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు వెంకటేశ్వర్లు, గోపి, నాగార్జున, కిసాన్ సెల్ నాయకులు గోవిందరావు, భాస్కర్, కిషోర్, గోవిందరావు, బస్వయ్య తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ విగ్రహ ఆవిష్కరణ



వైరారూరల్: అంబేడ్కర్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న మల్లు నందిని

వైరారూరల్: వైరా మున్సిపాలిటీ పరిధిలోని గండగలపాడులో ఏర్పాటు చేసిన అంబేడ్కర్ విగ్రహాన్ని ఆదివారం అమ్మ ఫౌండేషన్ చైర్మన్ మల్లు నందిని ఆవిష్కరించారు. అనంతరం స్నానాల లక్ష్మీపురం గ్రామంలో ముత్యాలమ్మ తల్లికి బోనాలు సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు. అలాగే స్నానాల లక్ష్మీపురం ప్రాథమిక పాఠశాలలో ఏర్పాటు చేసిన సరస్వతి దేవి విగ్రహాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో శీలం వెంకటనర్సిరెడ్డి, పుల్లయ్య, రామకృష్ణ, హనుమంతరావు, నందిని, వెంకటచారీ, వెంకటేశ్వరరావు, గణేష్, నాగేశ్వరరావు, ఉషారాణి, కళావతి, శ్రీలత, లక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

తాళ్లపెంటలో విగ్రహావిష్కరణ



సర్వాయ్ పాపన్నగౌడ్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

పెనుబల్లి: మండలంలోని తాళ్లపెంటలో బహుజన వీరుడు సర్దార్ సర్వాయ్ పాపన్నగౌడ్ విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు ర్యాలీ నిర్వహించి, సీనియర్ జర్నలిస్టు కుక్కా శ్రీనివాసరావు చేతుల మీదుగా విగ్రహాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో స్థానిక గౌడ సంఘ నాయకులు రాఘవులు, విఠల్‌రావు, నాగేశ్వరరావు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

దుస్తులు వితరణ



దుస్తులు సేకరిస్తున్న లంకా కొండయ్య

మధిర: మధిర పట్టణంలో ఆజాద్ రోడ్డులో ప్రముఖ సామాజిక సేవకుడు, లంకా సేవ ఫౌండేషన్ నిర్వాహకులు లంకా కొండయ్య ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మహాత్మా గాంధీ ఓల్డ్ క్లాత్ బ్యాంక్‌కు ఆదివారం పలువురు దాతలు పాత దుస్తులను వితరణగా అందజేశారు. ఈ సందర్భంగా లంకా కొండయ్య మాట్లాడుతూ.. మానవ సేవయే మాధవ సేవగా భావించి ప్రతి ఒక్కరు తమ ఇంట్లో అదనంగా ఉన్న దుస్తులు, ఉపయోగంలో లేని దుస్తులు ఓల్డ్ క్లాత్ బ్యాంక్‌కు అందిస్తే అవి మరొకరికి ఉపయోగపడతాయని తెలిపారు.

అపోహలతో విమర్శలు చేయొద్దు



మాట్లాడుతున్న టీపీసీసీ మహిళా ఉపాధ్యక్షురాలు మంజుల

కారేపల్లి: అపోహలు పడి కాంగ్రెస్ పార్టీలో కొంత మంది.. నాయకులపై విమర్శలకు దిగొద్దని, ఎమ్మెల్యేకు దూరం కావద్దని.. కాంగ్రెస్‌పార్టీ రాష్ట్ర మహిళా ఉపాధ్యక్షురాలు పగడాల మంజుల అన్నారు. ఆదివారం గేటుకారేపల్లి గ్రామంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ.. ఏమైన సమస్యలుంటే ఎమ్మెల్యే మాలోత్ రాందాస్‌నాయక్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించుకోవాలే తప్ప.. విమర్శలకు తావు ఇవ్వకూడదన్నారు. వైరా అభివృద్ధే ధ్యేయంగా పార్టీలకు అతీతంగా కొత్త, పాత అనే తేడా లేకుండా కలుపుకొని పోతున్న వైరా ఎమ్మెల్యే రాందాస్ నాయకత్వంలో అందరూ కలిసి వచ్చి పని చేయాలని ఆమె కోరారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ నాయకుడు ఇమ్మడి తిరుపతిరావు, సొసైటీ చైర్మన్ శ్రీనివాసరావు, రామ్మూర్తి, మాజీ ఎంపీపీ దేవ్లానాయక్, నర్సింగ్ శ్రీనివాసరావు, భీముడు, హీరాలాల్, ఉపేందర్, సనత్‌కుమార్, గోపాల్‌నాయక్, శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

ఆర్యవైశ్య సంఘం ఎన్నికకు నామినేషన్లు



నామినేషన్ వేస్తున్న మిట్టపల్లి కిరణ్‌కుమార్

వైరా: ఆర్యవైశ్య సంఘం మండల కమిటీ ఎన్నికకు ఆదివారం ఎన్నికల అధికారులు చారుగుండ్ల వెంకటలక్ష్మి నరసింహారావు, మహంకాళి వెంకట శ్రీనివాసరావు, వంగేటి రాజశేఖర్‌లు నామినేషన్లు స్వీరించారు. అభ్యర్థులు మిట్టపల్లి కిరణ్‌కుమార్, మిట్టపల్లి రాఘువరావులు నామినేషన్లు వేయగా అధికారులు నామినేషన్లు స్క్రూట్నీ నిర్వహించి ఇరు అభ్యర్థులు పోటీలు ఉన్నట్లు ప్రకటించారు. కాగా వచ్చే నెల ఒకటిన ఎన్నికలు నిర్వహించనున్నట్లు అధికారులు వెల్లడించారు. వనమా విశ్వేశ్వరరావు, శ్రీనివాసరావు, కిరణ్‌కుమార్, కృష్ణామూర్తిల పర్యవేక్షనలో నామినేషన్ల ప్రక్రియ జరిగింది.

బీటీ రోడ్డు పనులు ప్రారంభం

బోనకల్: మండలంలోని ఆళ్లపాడు – గోవిందాపురం గ్రామాల మధ్య రూ. 1.30కోట్లతో నిర్మించనున్న బీటీ రోడ్డు పనులను ఆదివారం కాంగ్రెస్ నాయకులు ప్రారంభించారు. దీంతో గ్రామస్తులు సంతోషం వ్యక్తం చేస్తూ.. నిధులు మంజూరుకు కృషి చేసిన భట్టికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు పాపారావు, వెంకటేశ్వర్లు, వెంకటమోహన్, నాగేశ్వరరావు, పాపారావు, నాగుల్‌మీరా, బరకయ్య తదితరులు పాల్గొన్నారు.

కలెక్టరేట్ ముట్టడిని జయప్రదం చేయండి



కొణిజర్ల: తనికెళ్లలో మాట్లాడుతున్న రమేష్

ఏన్కూరు: ఈ నెల 27న ఖమ్మంలో జరిగే కలెక్టరేట్ ముట్టడిని జయప్రదం చేయాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు జాగర్లమూడి రంజిత్‌కుమార్ కోరారు. ఆదివారం మండల కేంద్రంలో నిర్వహించిన సీపీఐ రైతు సంఘం సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల ముందు రైతులకు ఇచ్చిన హామీలు ఎలాంటి షరతులు లేకుండా రూ.2లక్షల రుణమాఫీ తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఐ వెంకన్న, రమేష్, నాగభూషణం తదితరులు పాల్గొన్నారు.

కొణిజర్ల: రుణమాఫీ విషయమై తెలంగాణ రైతు సంఘం (సీపీఐ) ఆధ్వర్యంలో రేపు నిర్వహించే ధర్నాకు రైతులు, సీపీఐ కార్యకర్తలు అధిక సంఖ్యలో హాజరుకావాలని తెలంగాణ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు దొండపాటి రమేష్ పిలుపునిచ్చారు. ఆదివారం మండలంలోని తనికెళ్లలో పీవీ రావు అధ్యక్షతన నిర్వహించిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాజకీయాల కోసం రైతులను బలి చేయొద్దన్నారు. ఈ సమావేశంలో రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు వెంకటేశ్వర్లు, నాయకులు శ్రీనివాసరావు, వెంకటేశ్వరరావు, వెంకటేశ్వర్లు, అచ్చయ్య, ప్రసాదరావు పాల్గొన్నారు.

కారేపల్లి: రైతులందరికీ రుణమాఫీ చేస్తామని చెప్పి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం, ఇప్పుడు కొర్రీలు పెట్టడం సమంజసం కాదని తెలంగాణ రైతు సంఘం కారేపల్లి మండల అధ్యక్ష , కార్యదర్శులు ఏకాంబరం, రామారావు తెలిపారు. రేపు నిర్వహించే ధర్నాను జయప్రదం చేయాలన్నారు. ఈ సమావేశంలో మాజీ సర్పంచ్ బన్సిలాల్, రైతు సంఘం నాయకులు మల్లయ్య, దేవప్రకాశ్, సీతారాములు, నాగేశ్వరరావు, మురళి, కొండయ్య, గోవిందరావు పాల్గొన్నారు.

చింతకాని: రేపు కలెక్టర్ ఎదుట నిర్వహించే ధర్నాను జయప్రదం చేయాలని ఏఐకేఎస్ తెలంగాణ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కొండపర్తి గోవిందరావు, తెలంగాణ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు మాదినేని రమేష్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎటువంటి షరతులు లేకుండా రైతులందరికీ రుణమాఫీ అమలు చేయాలన్నారు.


పద్య పోటీల్లో విజేతలు



బహుమతి అందజేస్తున్న దృశ్యం

మధిర: శ్రీకృష్ణాష్టమి సందర్భంగా మధిర సుమిత్ర యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక వేణుగోపాలస్వామి గీతా మందిరంలో శ్రీకృష్ణ శతక పద్య పఠన పోటీలను నిర్వహించారు. అందులో ప్రతిభ కనపరిచిన వారికి బహుమతులు అందజేశారు. పోటీల్లో సబ్ జూనియర్స్ విభాగంలో ఋగ్వేద, అన్విత, రుతిక మొదటి మూడు బహుమతులు పొందారు. అదేవిధంగా జూనియర్స్ విభాగంలో అక్షయ, చిన్మయి, కావ్యశ్రీ మొదటి మూడు స్థానాల్లో నిలిచారు. సీనియర్స్ విభాగంలో విషిత, మనోజ్ఞ, పౌర్ణమి అత్యున్నతమైన ప్రతిభ కనబరిచి బహుమతులు సాధించారు. ఈ పోటీలకు న్యాయనిర్ణేతలుగా వనం వరప్రసాద్, పుల్లఖండం చంద్రశేఖర్ తదితరులు వ్యవహరించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు సూర్యప్రకాశరావు, ఆలయ పూజారి విజయ్, సంస్థ ప్రధాన కార్యదర్శి, నిర్వాహకులు డాక్టర్ సుబ్బరాజు పాల్గొన్నారు.

కాంగ్రెస్ నాయకుడు మృతి



వసంతరావు(ఫైల్)


సత్తుపల్లి: సత్తుపల్లి నియోజకవర్గ కాంగ్రెస్ సీనియర్ నాయకుడు నరుకుళ్ల వసంతరావు(79) ఆదివారం తెల్లవారుజామున అనారోగ్యంతో మృతి చెందారు. పటేల్‌గా ఈ ప్రాంతంలో ప్రసిద్ధగాంచిన ఈయన మృతిపట్ల మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి, మాజీ మంత్రి సంభాని చంద్రశేఖర్, మాజీ ఎమ్మెల్యేలు సండ్ర వెంకటవీరయ్య, జలగం వెంకటరావు, మున్సిపల్ చైర్మన్ కూసంపూడి మహేష్‌లు తీవ్ర సంతాపాన్ని తెలిపారు.

ప్రయాణం ప్రమాదమే..



కోతకు గురైన రహదారి

కల్లూరురూరల్: మండలంలోని లింగాల నుంచి ఎర్రబోయినపల్లి వెళ్లే గ్రామాల మధ్య అసంపూర్తిగా నిర్మించిన బ్రిడ్జి వల్ల ప్రజలు తీవ్ర అవస్థలు పడుతున్నారు. బ్రిడ్జికి స్లాబ్ పూర్తి చేసినప్పటికీ ఇరువైపులా సైడ్ వాల్స్ నిర్మించకపోవడంతో వర్షాలకు రోడ్డు కోతకు గురైంది. సుమారు రూ. 2.5 కోట్ల వ్యయంతో నిర్మాణం చేపట్టిన కాంట్రాక్టర్ నిర్లక్ష్యంగానే ప్రయాణికులు, రైతులు ఇబ్బందులు పడుతున్నారు. ఇక రాత్రివేళ్లల్లో ప్రయాణించాలంటే అంతే సంగతులు.. ఇప్పటికైనా రెండువైపులా సైడ్‌వాల్స్ నిర్మించి కోతకు గురైన రోడ్డుకు మరమ్మతులు చేయించాలని ప్రజలు కోరుతున్నారు.



అటెన్షన్ ప్లీజ్

రోడ్డు పోయి గుంత వచ్చె

వైరా మున్సిపాలిటీలోని మధిర రోడ్డులో భారీ గుంతలు ఏర్పడ్డాయి. వర్షం వస్తే చాలు ఈ రోడ్డుపై గుంతలు ఎక్కడ ఉన్నాయో.. రోడ్డు ఎక్కడ ఉందో కూడా కనిపించనంత అధ్వానంగా మారిపోతుంది. వీటిని తప్పించి వాహనాలను నడపాలంటే వాహనదారులు తీవ్రంగా శ్రమించాల్సి వస్తోంది. పాదచారుల సంగతి వేరు చెప్పనక్కర్లేదు. గుంతలు పూడ్చాలని పలుమార్లు అధికారులను కోరినా ఫలితం లేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేశారు.

– వైరారూరల్

ప్రశ్నించాల్సిన అధికారి :
ఏ.విశ్వనాథ్, ఆర్అండ్‌బీ, ఏఈ
సెల్ నంబర్ : 9490538368





ఎర్రుపాలెం: జమలాపురంలో ముత్యాలమ్మకు బోనాలు సమర్పిస్తున్న మహిళలు

తల్లీ సల్లంగ చూడు..

శ్రావణ మాసంలో ఆదివారం బోనాల పండుగను ప్రజలు భక్తిశ్రద్ధలతో ఘనంగా జరుపుకున్నారు. మహిళలు సంప్రదాయబద్ధంగా బోనాలు నెత్తిన పెట్టుకుని ఊరేగింపుగా ముత్యాలమ్మ, గంగమ్మ ఆలయాలకు వెళ్లి అమ్మవారికి బోనాలు సమర్పించారు. ఈ సందర్భంగా ఆలయాలు కిటకిటలాడాయి. మహిళలు సామూహికంగా జలబిందెలతో అమ్మవారికి జలాభిషేకం చేసి, పూజలు నిర్వహించారు. నైవేద్యాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ప్రజలందరూ ఆయురారోగ్యాలతో చల్లగా ఉండాలని, పాడిపంటలతో కళకళలాడాలని, వర్షాలు సమృద్ధిగా కురవాలని వేడుకున్నారు. – సాక్షి నెట్‌వర్క్



సత్తుపల్లిటౌన్: అంబేద్కర్‌నగర్‌లో ముత్యాలమ్మకు పూజలు చేస్తున్న భక్తులు



తల్లాడ: రామానుజవరంలో.. ప్రభ బండ్లతో వెళ్తున్న భక్తులు



ముదిగొండ: ఎస్సీ కాలనీ నుంచి బోనాలతో బయలుదేరిన మహిళలు



చింతకాని: బస్వాపురంలో గంగమ్మ తల్లికి మొక్కులు చెల్లిస్తున్న మహిళలు



తల్లాడ: రామానుజవరంలో బొడ్రాయి వద్ద పూజలు చేస్తున్న మహిళలు



ముదిగొండ: వనంవారికిష్టాపురంలో..